క్లుప్తంగా

ఆర్తి హోంలో మహిళలకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న దుర్గాకుమారి

కడప కల్చరల్ : కడప నగరంలోని ఆర్తీ హోంలో స్థానిక మహిళలకు ఉపాధి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని హోం ప్రధాన కార్యదర్శి దుర్గాకుమారి తెలిపారు. శనివారం హోంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్థానిక మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్, హౌస్ కీపింగ్, శానిటరీ ప్యాడ్‌మేకింగ్, గిఫ్ట్ రాపింగ్ లాంటి అంశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. స్థానిక ప్రముఖులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సమాజంలోని మహిళలు ఆర్థికంగా స్థిరపడి వివక్షా రహితమైన జీవితాన్ని గడిపేందుకు, ఆర్థిక స్వావలంబన పొందేందుకు తమ కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు తగిన శక్తిని ఈ శిక్షణ ద్వారా సంపాదించాలన్నారు. ఆర్తి స్కూలు డైరెక్టర్ భాగ్యమ్మ, ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభ పాడిపిరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విద్యార్థులను సభకు పరిచయం చేశారు. ప్రోగామ్ కో–ఆర్డినేటర్ విక్రమ్, అలీఖాన్ పాల్గొన్నారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని ఊటుకూరు శుభసాయి మందిరంలో ఈ నెల 3న గురు పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, గణపతి ఆరాధన, నవగ్రహ మంటపారాధన ఉంటుందని వివరించారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు అందించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వమే పాఠ్యపుస్తకాలను అందించాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్‌ను తమ కార్యలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలు ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందించాలన్నారు. నగర నాయకులు సంతోష్, వేణు, లోకేష్ పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో శనీశ్వర పూజలు



శనీశ్వరునికి తైలాభిషేకం

కడప కల్చరల్ : శని త్రయోదశి సందర్భంగా శనివారం స్థానిక విజయదుర్గాదేవి ఆలయంలో శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల బృందం ఈ సందర్భంగా తొలుత స్వామికి తైలాభిషేకం నిర్వహించారు. అనంతరం మొక్కులు గల భక్తులకు స్వయంగా అభిషేకం నిర్వహించే అవకాశం కల్పించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు కుటంబ సభ్యులతో కలిసి తైలాభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ నెల 15న కూడా శనీశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యార్థి మృతికి కారకులైన బీరం శ్రీధర్ రెడ్డి విద్యా సంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. బీరం శ్రీధర్ రెడ్డి విద్యా సంస్థల్లో ఆరవ తరగతి చదువుతున్న సొహైల్ మృతిపై విచారణ జరిపి అందుకు బాధ్యులైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ... సొహైల్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీరం శ్రీధర్ రెడ్డి విద్యా సంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు.

పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు

కడప అర్బన్: తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలను ఇవ్వొద్దని కడప ఒన్‌టౌన్ ఎస్‌ఐ రంగస్వామి తెలియజేశారు. శనివారం కడప రైల్వే స్టేషన్ రోడ్డులోని రాజీవ్ మార్గ్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలను చేశారు. వాహనాల ఇన్సూరెన్స్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలలో మైనర్ల వాహనాల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్‌తో పాటు జరిమానా విధించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

‘జగనన్న సురక్ష’ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. అందులో భాగంగానే ‘జగనన్న సురక్ష’ పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. శనివారం కడప నగరంలోని 1,2,13,40 డివిజన్లలోని 8 సచివాలయాల్లో కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ‘జగనన్న సురక్ష’ శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను ఆయన పరిశీలించి, శిబిరానికి హాజరైన స్థానిక ప్రజలను పలకరించి ప్రభుత్వ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఏ ఒక్కరూ తమకు ప్రభుత్వ ఫలాలు అందలేదని చెప్పకూడదన్నారు. వారం రోజులుగా జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని సచివాలయాల వారీగా ‘జగనన్న సురక్ష’ శిబిరాలలో పరిష్కరించనున్నారన్నారు. ఇందుకోసం తహసీల్దార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయన్నారు. వివిధ కారణాల వల్ల ఏవైనా పథకాలు అందకుండా మిగిలిపోతే వారికి ఈ శిబిరాల ద్వారా లబ్ధి చేకూరుస్తామన్నారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లు, జనన, మరణ ధ్రువపత్రాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేది వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఏవైనా సందేహాలుంటే 1902 నంబర్‌కు కాల్‌చేసి ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్. చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.



13వ డివిజన్‌లో ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



2వ డివిజన్‌లో నిర్వహించిన ‘జగనన్న సురక్ష’లో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం

ఖైదీలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్



కడప కేంద్రకారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్: ఖైదీలు తమ ఆరోగ్యంపై జాగ్రత్తలను తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌చార్జ్ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కడప కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కేంద్రకారాగారంలను జడ్జి ప్రదీప్‌కుమార్, తమ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రదీప్‌కుమార్ పురుషుల కేంద్రకారాగారంలో మానసిక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో మందులను వాడాలని సూచించారు. వైద్యులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పురుషుల కేంద్రకారాగార, మహిళా కేంద్రకారాగార జైలర్లు, వైద్యాధికారులు, ఖైదీలు పాల్గొన్నారు.

భద్రత విషయంలో రాజీ వద్దు

ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ



విద్యుత్ ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఈ రమణ

కడప కార్పొరేషన్: భద్రత విషయంలో రాజీవద్దని, ప్రమాదాలను జీరో చేద్దామని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ పిలుపునిచ్చారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం విద్యుత్ భవన్ నుంచి విశ్వేశ్వరయ్య విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రమాదాలను అరికట్టాలని తెలిపారు. విద్యుత్ పనులను, మరమ్మతులను సొంతంగా చేసుకోకుండా నిపుణులతో చేయించుకోవాలన్నారు. విద్యుత్ ఉపకరణాలు ఉపయోగిస్తున్నప్పుడు సొంత భద్రతను నిర్ధారించుకోవాలన్నారు. సిబ్బంది విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రతా నియామాలు పాటించాలని, భద్రతా పరికరాలు ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎల్. నరసింహ ప్రసాద్, సోమ శ్రీనివాసులు, ఎస్‌ఏఓ మధు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పాతకడప జిల్లా పరిషత్ హైస్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషనర్

కడప కార్పొరేషన్: కడప నగరంలోని పాత కడప జిల్లా పరిషత్ హైస్కూల్‌ను కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్ క్యాలెండర్ బుక్‌ను పరిశీలించారు. విద్యార్థులంతా తప్పనిసరిగా యూనిఫారం ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అమ్మ ఒడి పథకం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు సబ్జెక్టును అర్థమయ్యేలా ఏ విధంగా నేర్చుకోవాలో బోధించారు. విద్యార్థులు తాము నేర్చుకున్న పాఠాలను తోటి విద్యార్థులతో చర్చించడం ద్వారా వారి తెలివి మెరుగుపడుతుందని, జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలిపారు. అంతకుముందు ఆయన పలు డివిజన్లలో నిర్వహిస్తున్న ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

బాషామొహిద్దీన్ సేవలు ఎనలేనివి



బాషామొహిద్దీన్‌ను సన్మానిస్తున్న క్రీడారంగ ప్రముఖులు

కడప స్పోర్ట్స్: క్రీడారంగంలో 34 ఏళ్ల పాటు కోచ్‌గా, డీఎస్‌డీఓగా, చీఫ్ కోచ్‌గా, వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారిగా ఎస్. బాషామొహిద్దీన్ విశేష సేవలందించారని పలువురు క్రీడాప్రముఖులు కొనియాడారు. క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారిగా ఈనెల జూన్ 30వ తేదీన ఉద్యోగవిరమణ చేసిన బాషామొహిద్దీన్ క్రీడా పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, నూతన ప్రత్యేకాధికారి కె. జగన్నాథరెడ్డిలు మాట్లాడుతూ క్రీడాపాఠశాలకు ప్రత్యేకాధికారిగా సుదీర్ఘకాలం సేవలందించి, ఎందరో క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించేలా కృషిచేశారన్నారు. డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్, శిక్షకులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రాణదాతల రుణం తీర్చుకోలేం



మాట్లాడుతున్న కళాశాల కార్యదర్శి జవ్వాద్



వైద్యులను సత్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రాణదాతలైన వైద్యుల రుణం తీర్చుకోలేమని వన్‌టౌన్ సీఐ నాగరాజు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పాత కలెక్టరేట్‌లోని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) కార్యాలయంలో శనివారం ఆరుగురు వైద్యులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని కొనియాడారు. సంస్థ పూర్వ కన్వీనర్ ఎస్.ఎలియాస్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి మాట్లాడారు. సీనియర్ వైద్యులు డాక్టర్ పుత్తా బాలిరెడ్డి వైద్యుల దినోత్స వం గురించిన వివరాలు తెలిపారు. డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడారు. సంస్థకో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, బాల యల్లారెడ్డి, ఆకృతి కిశోర్, గౌరీశంకర్, కొండారెడ్డి, మనీష్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైనది

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని ఫాతిమా మెడికల్ కళాశాల కార్యదర్శి డాక్టర్ జవ్వాద్ తెలిపారు. శనివారం ఫాతిమా మెడికల్ కళాశాల ఆడిటోరియంలో జాతీయ వైద్యుల దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యులు సమాజానికి తమవంతుగా తోడ్పాటు అందించాలని, పేదలకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలాచూడాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్, సూపరిండెంట్ డాక్టర్ ఓబులేసు మాట్లాడారు. డైరెక్టర్ జయరామిరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్ రెడ్డి మాట్లాడారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.శనివారం వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మేయర్ కె. సురేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను కాపాడే ప్రాణదాతలు వైద్యులన్నారు. దివంగత వైఎస్సార్‌తోపాటు ఎంతోమంది వైద్యులు రాజకీయాల్లో రాణించారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేసి వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్న వేలాది ఖాళీలను భర్తీ చేశారని, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఏపి సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ సునీల్ కుమార్, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు శివానాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ నాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వినోద్, ఏపీఎస్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ ఇలియాస్, సొహైల్ అహ్మద్, వారణాసి ప్రతాప్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, స్టీఫెన్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

వినూత్న ఆలోచన.. జగనన్న సురక్ష

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



చీమలపెంటలో ప్రజలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదిలో నుంచి వినూత్నంగా పుట్టిన ఆలోచనే ఈ జగనన్న సురక్ష.. అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని నల్లింగాయపల్లె, కమలాపురం వార్డు–1 సచివాలయాల్లో జరిగిన జగనన్న సురక్ష క్యాంప్‌లో లబ్ధిదారులకు ఆయన 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష.. కార్యక్రమాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మదిలో నుంచి పుట్టుకొచ్చిన వినూత్న ఆలోచనలేనన్నారు. నల్లింగాయపల్లెలో 380, కమలాపురం 1వ వార్డు సచివాలయంలో 229 మందికి సర్టిఫికెట్లు జారీ చేయడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్‌సీ బోర్డు మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చీమలపెంట గ్రామంలో శనివారం జగనన్న సురక్ష పథకం లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు.


కేఎస్‌ఆర్‌ఎంలో ఘనంగా స్నాతకోత్సవం



విద్యార్థికి పట్టాను అందచేస్తున్న వైస్ చైర్మెన్ మదన్‌మోహన్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 2019–23 సంవత్సరానికి చెందిన బ్యాచ్ విద్యార్థులు 6వ స్నాతకోత్సవాన్ని కళాశాల సభా సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీకి చెందిన డిప్ఓషన్ మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసర్చ్ సంచాలకులు డాక్టర్ వెంకట రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలను అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల ఇంజనీరింగ్ విద్యలో సాధించిన ప్రగతే కాకుండా యువ ఇంజనీర్లుగా అటు సమాజానికి, ఇటు భావితరాల వారికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. కళాశాల వైఎస్ చైర్మెన్ కందుల మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడారు. కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, జవహరాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నామిని డాక్టర్ వసుంధర, కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌ఎస్‌మూర్తి, కేఎల్‌ఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్తి’ సంధ్యమ్మకు ‘నాటా’ సత్కారం



సంధ్యమ్మకు అవార్డు ప్రదానం చేస్తున్న నాటా ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరంలో ఆర్తీ హోం సంధ్యమ్మను నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) సత్కరించి అవార్డును అందజేశారు. ఆర్తీ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పుచ్చలపల్లి సంధ్యమ్మను నాటా సమావేశాల వేదికపై శనివారం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. బాలికా సంరక్షణకు సంబంధించిన వివిధ పథకాలు కార్యక్రమాల ద్వారా మహిళాభ్యుదయానికి, స్త్రీ సమానత్వానికి, బాలికా వికాసానికి ఆమె చేస్తున్న అనితర సాధ్యమైన కృషిని వారు వేదికపై ప్రత్యేకంగా ప్రశంసించారు. కోవిడ్ కారణంగా అనాథలైన 732 మంది చిన్నారుల సంరక్షణ బాధ్యతను, 1500 మంది విద్యార్థుల చదువుకు ఆర్థికసాయాన్ని అందిస్తున్నందుకు సంధ్యమ్మను ఘనంగా సత్కరించారు. కోవిడ్ సమయంలో జిల్లా ప్రజలను ఆదుకున్నందుకు ప్రతిష్ఠాత్మక వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కిందని కొనియాడారు.

వసతిగృహాన్ని తనిఖీ చేసిన రిజిస్ట్రార్



వసతిగృహంలోని వంటశాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయ వసతిగృహాన్ని ఏఎఫ్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి తనిఖీ చేశారు. శనివారం మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి భోజనం అందుతున్న స్థితిగతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయాలని ఆదేశించారు. వంట చేయడంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వంటశాల, స్టోర్ రూం తదితర గదులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విశ్వవిద్యాలయ సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

3న కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుడ్య పరీక్షలు నిర్వహించాలని కోరుతూ ఈ నెల 3న కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నిరసనను జయప్రదం చేయాలని కోరుతూ నగరంలోని పలు కోచింగ్ సెంటర్లలో కరపత్రాలను ఆవిష్కరించారు. డీవైఎఫ్‌ఐ నాయకులు ఓబులేసు, డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

ఆర్‌జేడీకి పీఆర్‌టీయూ వినతి



ఏవోకు వినతిపత్రమిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఎంఈఓ–1 పోస్టులను ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సీనియార్టీ ప్రాతిపదికనే భర్తీ చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామకృష్ణంరాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం ఆర్‌జేడీ కార్యాలయ ఏఓ సత్యనారాయణకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ 154 ప్రకారం 1158 ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ పోస్టులను రద్దు చేసి వాటి స్థానంలో ఎంఈఓ–1గా 13 పోస్టులను, ఎంఈఓ–2గా 679 క్రియేట్ చేశారన్నారు. ఎంఈఓ–1 కింద మంజూరైన పోస్టులను ఏ మండలాలకు కేటాయించింది స్పష్టత లేదన్నారు. ఈ విషయంలో అధికారులు ఆలోచించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది అవినీతిపై విచారణ జరపాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మండల రెవెన్యూ సిబ్బంది అవినీతిపై విచారణ జరపాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరి కేసీ బాదుల్లా పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఆయన మాట్లాడారు. నగరంలోని మృత్యుజయకుంటలో ఇటీవల పున నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు వద్దకు వెళ్లి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మునక ప్రాంతంలో నిర్మాణాలు నిషేధమంటూ నగరపాలక సంస్థ సిటీ ప్లానింగ్ అధికారులకు నిలుపుదల చేసి తర్వాత బేరం కుదుర్చుకొని నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. విధి నిర్వహణలో ఉన్న వీర్వోలు వంక, వాగులు, ప్రభుత్వ భూములు కాపాడటంలో విఫలం చెందారన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని పెద్ద బెస్తవీధికి చెందిన నాగేశ్ అనే వ్యక్తి నవత ట్రాన్స్‌పోర్ట్ సమీపంలో శనివారం సాయంత్రం మట్కా రాస్తుండగా ఎస్‌ఐ జయరాముడు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 14,500 నగదుతో పాటు, మట్కా స్లిప్‌లను స్వాధీనం చేసుకున్నారు.